ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

మంగళవారం 30 జనవరి 2024



షుగర్ ఫ్యాక్టరీలు తెరిచే విధంగా చర్యలు 7లో..

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి 8లో..

# గ్యాస్ సరఫరాలో వసూళ్లు

● ఒక్కో సిలిండర్‌పై రూ. 20 నుంచి 50 వరకు డిమాండ్ ● జిల్లా వ్యాప్తంగా 3,39,715 కనెక్షన్లు

● జగిత్యాల అనుబంధ గ్రామానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి ఇటీవల గ్యాస్ సిలిండరు మీద అదనపు వసూళ్లపై డెలివరీ బాయ్‌ను నిలదీశాడు. వెంటనే ఆ వ్యక్తి.. సిలిండరు ఇవ్వడానికి నిరాకరించాడు. డెలివరీ బాయ్‌తో వాగ్వాదం పెట్టుకోవడంతో ఇంటి బయటే సిలిండరు వదిలేశాడు. చేసేది లేక విశ్రాంత ఉద్యోగి పూర్తి మొత్తం ఇవ్వాల్సి వచ్చింది.

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంట గ్యాస్ సిలిండరు ధరపై అదనపు వసూళ్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గృహావసరాల గ్యాస్ సిలిండరు ధర బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా మారుతోంది. ఒక్కో నెలలో పెరుగుతూ, మరో నెలలో తగ్గుతూ ఉండటం వల్ల వాస్తవ ధర వినియోగదారులకు స్పష్టంగా తెలిసే పరిస్థితి ఉండటం లేదు. ఇదే ఎక్కువనుకుంటే.. సిలిండరు అసలు ధర కంటే ఇంటికి అందించే సమయంలో అదనంగా వసూలు చేస్తుండటం మరింత భారమవుతోంది. ఈ వసూళ్లు చిల్లరగా కనిపించినా...నెల నెలా ఇది లక్షల్లో సాగుతోంది.

## జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల సంఖ్య

జిల్లా వ్యాప్తంగా 21 ఎల్‌పీజీ గ్యాస్ ఏజన్సీలున్నాయి. ఈ ఏజెన్సీల్లో సుమారు 3,39,715 సిలెండర్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం పథకం సిలెండర్ కనెక్షన్లు 55,705, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల పథకం సిలెండర్ కనెక్షన్లు 41,550, సాధారణ సిలెండర్ కనెక్షన్లు 2,42,460 వరకు ఉన్నాయి. మొత్తం కనెక్షన్లలో ప్రతినెల సుమారు పాతిక శాతానికి పైగా రిఫిల్స్ వినియోగదారులు తీసుకుంటున్నారన్న అంచనా ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు నెలకు లక్ష గ్యాస్ రిఫిల్స్‌ను ఏజన్సీల నిర్వాహకులు విక్రయిస్తున్నారు. పట్టణాలతో పాటు సమీప ప్రాంతాల్లోని పల్లెలు, మారుమూల గ్రామాలకు సిలెండర్లు పంపిణీ చేసే సందర్భాల్లో ఏజన్సీల సిబ్బంది నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఒక్కో సిలెండర్‌పై అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు.



### ఎప్పటి నుంచో అక్రమ వసూళ్ల దందా...

జిల్లాలో గ్యాస్ సిలిండరును సరఫరా అక్రమ వసూళ్ల దందా ఎప్పటి నుంచో సాగుతున్నా ... అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒకవైపు బిల్లులపై ఉన్న ధరకు అదనంగా చెల్లించవద్దని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారు. మరోవైపు ఇంటికి తీసుకొచ్చే ఏజెన్సీ సిబ్బంది మాత్రం రూ. 10 నుంచి రూ. 25 వరకూ ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. జిల్లా క్రేంద్రంలోనే సిలిండరుపై అదనంగా రూ.20 నుంచి రూ. 25 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. చాలా మంది గృహిణులు వాస్తవ మొత్తాన్ని గమనించకుండా అడిగినంతా ఇచ్చేస్తున్నారు. కొంత మంది ప్రశ్నిస్తే... దురుసుగా ప్రవర్తించడం, సిలిండరు వెనక్కి తీసుకెళ్లిపోయి తాళం వేసి ఉందని నమోదు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు.

మరికొందరు తమకేమీ జీతం ఉండదని, తెచ్చినందుకు చార్జీల రూపంలో వచ్చేదే ఆదాయమని చెప్పడంతో మారు మాట్లాడకుండా ఆ మొత్తాన్ని ఇచ్చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు నిర్ణయించిన ధరే తాము వసూలు చేస్తున్నామని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 25కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో మహిళలు చాలామంది దీపం పథకాన్ని వినియోగిస్తున్నారు. వీరికి ఏజెన్సీలు చాలా కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. తాము వెళ్లి సిలిండర్లను తెచ్చుకోలేక, ఇంటికి తీసుకొస్తే అదనపు మొత్తం చెల్లించలేక గ్యాస్ వినియోగానికి దూరం అవుతున్నారు.

### ఐదు కిలోమీటర్లు దాటితేనే....

గ్యాస్ సిలిండర్లకు అదనంగా వసూలు చేయవద్దని ఏజెన్సీలకు చెబుతున్నట్లు పౌరసరఫరాల శాకఖ అధికారులు పేర్కొంటున్నారు, సిలిండరు డెలివరీ పరిధిలో ఐదు కిలో మీటర్ల లోపు ఉంటే ఉచిత మేనని, పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. ఐదు నుంచి 30 కిలోమీటర్ల వరకైతే రూ. 10 మాత్రమే అదనంగా వసూలు చేస్తారని తెలిపారు. ఏజెన్సీలు, సిబ్బంది వినియోగదారులను ఇబ్బంది పెట్టకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని అధికారులు అంటున్నారు.

### అందుబాటులో లేని తూనిక యంత్రాలు..

గ్యాస్ సిలెండర్ డెలివరీలో ఏజన్సీ నిర్వాహకులు నిబంధనల ప్రకారం పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతీ సిలెండర్‌కు తప్పనిసరిగా సీల్ ఉండాలి. డెలివరీ బాయ్స్ అంతా తమ వెంట తూనిక యంత్రం (స్ప్రింగ్ త్రాసు) అందుబాటులో ఉంచుకోవాలి. వినియోగదారులు ఎవ రైనా అడిగితే సిలెండర్ తూకం వేసి చూపించాల్సి ఉంటుంది. గృహావసర సిలెండర్‌లో నికరంగా గ్యాస్ 14.200 కేజీలు, సిలెండర్ బరువు 15.300 కేజీలు కలుపుకొని మొత్తంగా 29.500 కేజీలు ఉండాలి. వినియోగదారులకు సరఫరా చేస్తున్న సిలెండర్ బరువు తక్కువగా ఉన్నట్లు అనుమానం వస్తే తక్షణమే తూకం వేసి చూపించాల్సి ఉంటుంది. తూకం వేస్తే డెలి వరీ బాయ్స్ నిరాకరిస్తే వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చును. అయి తే అవగాహన లోపం కారణంగా ఫిర్యాదులు అందడం లేదు.

### ఏడాదిలోనే కోట్లల్లో వసూళ్లు....

జిల్లాలో సాధారణ సీఎస్ఆర్, దీపం కలిపి మొత్తం 3,39,715 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ గ్యాస్ వినియోగం తప్పనిసరి. ఇందు లో ప్రతి నెలా క్రమం తప్పకుండా సిలిండరు తీసుకుంటున్న కనెక్షన్లు సుమారు లక్ష వేసుకున్నా...ఒక్కో వినియోగదారుడి నుంచి సగటున రూ. 20 అదనపు వసూళ్లు అనుకున్నా.. మొత్తంగా సుమారు ఇరవై లక్షల రూపాయలను అదనంగా చెల్లిస్తున్నట్లే. మనం చిల్లరే కదా అని వదిలేసిన మొ త్తం ఒక యేడాదిలో సుమారు రూ. 2.40 కోట్లు అదనపు బారాన్ని వినియోగదారులు మోయాల్సి వస్తోంది.

### చార్జీలను ఏజెన్సీలు వాడుకుంటున్నాయి..

గోదాం నుంచి వినియోగదారుడి ఇంటి వరకు సిలెండర్‌ను చేర్చి, ఖాళీ సిలిండర్‌ను మళ్లీ గోదాంలో చేర్చేందుకు గాను ప్రతి ఏజెన్సీకి సదరు కంపెనీలు రవాణా చార్జీలు చెల్లిస్తాయి. ఆ మొత్తాన్ని సిబ్బందికి ఇచ్చి, ఎమ్మార్పీకే సిలిండర్లను సరఫరా చేయాల్సిన బాధ్యత ఆయా ఏజెన్సీలదే. అయితే కంపెనీలిచ్చిన రవాణా చార్జీలను ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయన్న ఆరోపణ లున్నాయి. ఏజెన్సీలు తమకు జీతం ఇవ్వడం లేదని, వినియోగదారుల నుంచే వసూలు చేసుకోవాలంటున్నారని డెలివరీ బాయ్ ఒకరు తెలిపారు. సొంత వాహనంతో బండ చాకిరి చేస్తూ రూ. 20 మాత్రమే గ్యాస్ బండకు వసూలు చేస్తున్నట్లు వివరించారు.

### ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

**వెంకటేశ్వర్ రావు, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి**



గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ సరఫరా సమయంలో అదనంగా వసూలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు చేపడతాం. అవసరమైతే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఏజెన్సీ నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు, ఆదేశాలు అందిస్తాము.

---

బీఆర్ఎస్ హయాంలో..

## దళితులకు ఎన్నిళ్లు ఇచ్చారో చెప్పాలి

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**



యువకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జనవరి 29 : బీఆర్ఎస్ పాలనలో ఎంతమంది దళితు లకు ఇండ్లు ఇచ్చారో చెప్పాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన యువకులు గ్రామసర్పంచ్ పొగళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో గల తకళ్లబండ ఎస్సీ కమ్యూనిటీ భవనప్రహరీ నిర్మాణానికి, మురికికాలువ నిర్మాణానికి జీవన్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అంబేద్కర్ సంఘ భవనానికి గతంలో రూ. 3 లక్షలు మంజూరు చేశామని, మరో రూ. 5లక్షలు మంజూరుచేసి భవన నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో పేపర్ల లీకేజీతో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై నమ్మకం పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పారదర్శక పాలన సాధ్యమవుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు పాల్గొన్నారు.

## రాయికల్ మున్సిపాలిటీలో ముసలం

**అవిశ్వాస తీర్మానం పెట్టాలని కలెక్టర్‌కు కౌన్సిలర్ల వినతి**



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

రాయికల్, జనవరి 29: రాయికల్ మున్సిపల్‌లో అవిశ్వాస ముసలం మొదలైంది. సోమవారం 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను కలిసి వినతి పత్రం అందించారు. చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిలపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మెజార్టీ కౌన్సిలర్లు వినతి పత్రం అందజేశారు. రాయికల్ మున్సిపల్‌లో 12 వార్డులు ఉండగా ఇందులో 10 బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు చెరొకటి గెలుచుకోగా, బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంది. సొంత పార్టీ కౌన్సిలర్లలో ముసలం మొదలై అవిశ్వాసం పెట్టేందుకు మెజార్టీ కౌన్సిలర్లు కలెక్టర్, అదనపు కలెక్టర్ దివాకరను కలిసి వినతి పత్రాలను అందజేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ల చర్య స్థానికంగా చర్చ నీయాంశమైంది. వినతి పత్రం ఇచ్చినవారిలో కౌన్సిలర్లు మేకల కాంతారావు, లతికఅనిల్, సువర్ణసత్యనారాయణ, మహేష్ గౌడ్, సాయి కుమార్, మహేందర్, శ్రీధర్ రెడ్డి, అన్సరీ బేగం ఉన్నారు.

## కక్ష పూరిత వైఖరి సరికాదు

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పాల్గొన్న జడ్పీ చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, జనవరి 29 : బీఆర్ఎస్ నాయకులపై కక్ష పూరిత వైఖరి అవలంబించడం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి సరికాదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం సంజయ్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని జాబితాపూర్, హబ్సీపూర్ సర్పంచులతో పాటు జడ్పీ చైర్ పర్సన్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ అనుబంధ నాయకులపై విజిలెన్స్ కమిటీతో పాటు జిల్లా అధికారులు చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ సర్పంచులు ఉన్న చోట్ల సైతం అభివృద్ధికి సహకరించామన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్ని బెల్టు షాపులు మూసివేయించారో ఎమ్మెల్సీ సమాధానం చెప్పాలన్నారు. 420 హామీలు ఇచ్చి కేవలం ఆరు గ్యారంటీ పథకాలపైనే కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించి మాట్లాడిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి మాటలను పూర్తిగా తప్పుబట్టారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, సతీష్, మల్లయ్య పాల్గొన్నారు.

---

## సీనియర్ సిటిజన్లకు సర్కారు భరోసా

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

జగిత్యాల టౌన్, జనవరి 29 : సీనియర్ సిటిజన్లకు సర్కారు అన్ని విధాలుగా భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరా భవన్‌లో సోమవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలండర్లను, డైరీలను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో హరి అశోక్ కుమార్ ఉ న్నారు. అలాగే ఇంటర్ స్పాట్ ఏర్పాటు చేయాలని కోరు తూ తెలంగాణ గెజిటెట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియే షన్ సభ్యులు ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేశారు. కొ ట్టాల తిరుపతి రెడ్డి ఉన్నారు. జగిత్యాల రూరల్ మండ లం అంతర్గాం గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిసి జీపీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థులు ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలి

రాయికల్, జనవరి 29: విద్యార్థులు ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంక్ ఇటిక్యాల బ్రాంచ్ మేనేజర్ పి.రవి అన్నారు. రాయికల్ మండలం ఇటిక్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా సోమవారం యూనియన్ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంక్‌లో జరుగు కార్యకలాపాల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ ఖాతా పుస్తకాలు అందజేశారు. విజ్ఞాన విహార యాత్రలో మిగిలిన కొంత నగదును ఆయా విద్యార్థుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజెంగి రాజేశం, చెరుకు మహేశ్వర్ శర్మ, ఎద్దండి రమేష్, ఖాజా జియావొద్దీన్, వి.సంపత్ కుమార్, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వి.రంజిత్ కుమార్, క్యాషియర్ టి.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి వెళ్లే విధంగా బస్సులు ఎక్కువగా సకాలంలో పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకునే విదంగా వేయించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జిరాక్స్ సెంటర్‌లలో పరీక్షా పేపర్ డౌన్ లోడ్ చేసి ప్రింట్ చేయించాల్సి ఉంటుందని, కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరాఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### పకడ్బందీగా అల్బెండ జోల్ మాత్రల పంపిణీ జరపాలి

జిల్లాలో పకడ్బందీగా అల్బెండ జోల్ మాత్రల పంపిణీ జరపాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 0 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికి మాత్రలు పంపిణీ చేయాలన్నారు. తప్పకుండా ఏ ఒక్కరికి మిస్ కాకుండా అందరికి మాత్ర అందించే విధంగా ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, దివాకర, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు రాజేశ్వర్, మధు, కలెక్టరేట్ ఏవో హన్మంత్ రావు, జిల్లా ఇంటర్ అధికారి నారాయణ పాల్గొన్నారు.

### ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజావాణి సమస్యలకు అధికారులు సత్వర పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 46 మంది వ్యక్తుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీవోలు రాజేశ్వర్, మధు, కలెక్టరేట్ ఏవో హన్మంత్‌రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఆందోళన

జగిత్యాల టౌన్, జనవరి 29 : జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గంటకు పైగా తమ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ రెండు నెలలకు పైగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో ఉంటున్నప్పటికి మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు.

## బీర్‌పూర్ సర్పంచ్‌పై డీపీవో ఫిర్యాదు

బీర్‌పూర్, జనవరి 29: బీర్‌పూర్ గ్రామ సర్పంచ్‌పై గ్రామ వార్డు సభ్యులు శనివారం డీపీవోకు ఫిర్యాదు చేశారు. 2020వ సంవత్సరంలో గ్రామ పంచాయతీ నిధుల నుంచి వైకుంఠ దామం నిర్మించడానికి ఒక్క సారి 2లక్షలు, మరో సారి 80వేల రూపాయలు తీసు కొని పనులు పూర్తి చేశారు. బిల్లులు వచ్చాక రెండు లక్షల ఎనభై వేలు గ్రామ పంచాయతీ నిధులలో జమ చేస్తానని చెప్పి ఇప్పటి వరకు గ్రామ పంచాతీ ఖాతాలో జమ చేయలేదు. ఈ విషయమై గతంలో మండల పంచాయతీ అధికారికి, మండల అభివృద్ధి అధికారికి, ప్రజావాణిలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ నుంచి తీసుకొని వైకుంఠ దామం నిర్మాణం కోసం వాడుకున్న డబ్బులు రికవరి చేసి బాధ్యులపై తగు చర్యలు తీసు కోవాలని సభ్యులు భైరవేణి సత్యనారాయణ, పూడూరి రవి డీపీవోను కోరారు.

## అయోధ్య సైకిల్ యాత్రికులకు సన్మానం

రాయికల్, జనవరి 29: రాయికల్ పట్టణం నుంచి అయోధ్య బాలరాముని దర్శనం కోసం సైకిల్ యాత్ర చేపట్టి తిరిగి వచ్చిన పట్టణానికి చెందిన గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్‌లను హిందూ ధర్మవాదులు లింగ శ్రీనివాస్, సామల సతీష్‌లు సన్మానం చేశారు. గత 500 సంవత్సరాల హిందువుల పోరాటం అయోధ్య ఆలయ ప్రతిష్ఠతో హిందువుల ఆకాంక్ష నెరవేరిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్య క్షుడు కల్లెడ ధర్మపురి, జాతీయవాది ఎనుగందుల రమేష్, ఆర్ఎస్ఎస్ గో ప్రచార ప్రముఖ్ గన్నవరం గంగాధర్, ధర్మ జాగరణ సమితి మండల విభాగ్ తిరుకోవెల సురేందర్, పల్లికొండ నరేష్, చింత శివ కుమార్, చంద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్మన్

కోరుట్ల, జనవరి 29 : కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్మన్‌శీలం వేణుగోపాల్ బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సంగరావు సమక్షంలో శీలం వేణుగోపాల్ 100 మంది అనుచరులతో పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి జువ్వాడి నర్సంగరావు, జువ్వాడి కృష్ణారావు పార్టీలోకి ఆహ్వానించారు. వేణుగోపాల్ కాంగ్రెస్‌లో క్రియాశీల రాజకీయాల్లో ఉండి 2014 జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరి వార్డు మెంబర్‌గా పోటీ చేశాడు. అప్పుడు బీఆర్ ఎస్‌లో ప్రాతినిథ్యం వ్యహించి మున్సిపల్ చైర్మన్ పదవిని పొందాడు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2019 జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున 24వ వార్డు నుంచి అతని భార్య శీలం జయను గెలిపించుకున్నాడు. ప్రస్తుతం బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. స్వంత గూటికి రావడంతో పట్టణంలో కాంగ్రెస్ బలం పెరిగినట్లు అయింది.

### కాంగ్రెస్ వైపు చూస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని చివరికి పార్టీలో కేసీఆర్ కుటుంబ సభ్యులు ముగ్గురే మిగులుతారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో విలేకర్ల సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టి వారి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడే మాటలు అన్ని అబద్దాలేనని, వచ్చే మున్సిపల్, గ్రామపంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదంకా మోగిస్తుందని అశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు మచ్చ కవిత, ఆడెపు మధు, పేట బాస్కర్, సంగ లింగం, సేనా పతి, వెంకట స్వామి, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, చెదలు సత్యనారాయణ పాల్గొన్నారు.



శీలం వేణుగోపాల్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న జువ్వాడి...మాట్లాడుతున్న నర్సింగరావు

## ధర్మపురిలో సంకటహర చతుర్థి పూజలు



స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 29: ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 29: విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. కళాశాలలో గణిత శాస్త్ర విభాగానికి సంబంధించిన విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన చేసి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ రాజేష్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రంలో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్ర అధ్యయనం వలన సమాజానికి ఉపయోగకరమైన అంశాలను కనుక్కునే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.




మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్

## 1న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జనవరి 29: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షలను గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. ఏదైనా కారణం చేత కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోల్ ఎక్కే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

## రెండు ఆలయాల్లో చోరీకి యత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాలస్వామి బాలాలయంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఏమీ లభించకపోవడంతో వెంట తెచ్చుకున్న పరికరాలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆల యానికి వెళ్లిన భక్తులకు ఇనుప చువ్వలు, పరిసర ప్రాంతాలు చిందరవందరగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రల నిపుణుల బృందం నమూనాలను సేకరించింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ వివరాలు తెలుసుకున్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రెండు ఆలయాల పరిసరాల్లోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని స్థానికులు పేర్కొన్నారు. పలువురు ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంభీరావుపేట, జనవరి 29: గంభీరావుపేట మండలం పెద్దమ్మ సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వినోద్ (35)అనే వ్యక్తి బైక్‌పై పెద్దమ్మ మీదుగా సిరిసిల్ల వైపు వెళుతుండగా, గొల్లపల్లి నుంచి గోరంటాల మీదుగా గంభీరావుపేటకు వస్తున్న ప్యాసింజర్ ఆటో మూల మలుపు వద్ద ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న వినోద్ మృతి చెందగా, ఆటో డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. దీంతో అతన్ని ఆసుపత్రికి తరళించారు. ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీస్‌లు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





# భక్తజన సంద్రంగా వేములవాడ


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం


వాహనాలతో నిండిపోయిన గుడి చెరువు పార్కింగ్ స్థలం

**● 50 వేలకు పైగా భక్తుల రాక**

వేములవాడ, జనవరి 29 : దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు ప్రతి నిత్యం వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 50 వేల మందికి పైగా భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన శ్రీ స్వామివారి దర్శనం రాత్రంతా కొనసాగగా సోమవారం రాత్రి వరకు భక్తులు నిరంతరాయంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శ్రీ స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటలకు నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## భూకబ్జాలపై కరీంనగర్‌లో ఫిర్యాదుల పర్వం

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో భూకబ్జాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదుల పర్వం కొనసాగుతున్నది. సోమవారం ఒక్క రోజే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 70 మందికిపైగా బాధితులు పోలీస్‌కమిషనర్‌ను కలిసి వారికి జరిగిన అన్యాయాలను వివరించి, ఫిర్యాదులు చేశారు. వీరందరి ఫిర్యాదులు స్వీకరించిన సీపీ ఫిర్యాదు తీవ్రతను బట్టి ఆయా ఠాణాలకు, ఏసీపీలకు విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కొందరు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ ఆర్థిక సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఫిర్యాదులు కూడా అధికంగా రావటంతో భూకబ్జాల కేసుల విచారణపై ప్రభావం పడే అవకాశముంది. భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఒక్కొక్కటిగా విచారణ చేపడుతున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు గుర్తించి వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినమీదట నిందితులు, వారికి సహకరించిన వివిధ శాఖల ఉద్యోగులు, కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారిస్తున్నారు. నివేదికను తయారు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిసింది. సోమవారం కరీంనగర్‌లోని కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్‌తోపాటు మరో ఇద్దరిని మూడో ఠాణాకు పిలిపించి విచారించి పంపించినట్లు సీఐ వి శ్రీనివాస్ తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన ఒక బాధితుడు తన భూమిని కొందరు కబ్జాచేశారంటూ పోలీస్‌కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో రికార్డులు, డ్యాకుమెంట్ల పరిశీలన, విచారణలో భాగంగా సదరు కార్పొరేటర్, మరో ఇద్దరిని పిలిపించి మాట్లాడి పంపించామని సీఐ తెలిపారు.

## గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

**● మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపం**

కరీంనగర్ క్రైం, జనవరి 29: మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపం చెందిన కొత్తపల్లి మండలం చింతకుంటలోని గురుకుల కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న జనుప అక్షిత(17) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.... జగిత్యాల జిల్లా మల్యాల మండలం మైనంపల్లికి చెందిన అక్షిత సాయంత్రం 7 గంటల వరకు తోటి విద్యార్థినిలతోనే కలిసి ఉంది. విద్యార్థినిలు భోజనానికి వెళ్లిన సమయంలో డ్రెస్ మార్చుకుని వస్తానని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు గమనించి వార్డెన్, ఇతర సిబ్బందికి సమాచారం అందించారు. బలవంతంగా తలుపులు తెరచి ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ముందు అక్షిత సూసైడ్ లెటర్ రాసింది. తనకు కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయని బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో తన పేరును ఎక్కించారని, తను 7 గంటలకు డిన్నర్ తరువాత చనిపోతున్నానంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొంది.

కాగా కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చిన 15 మంది విద్యార్థినిల పేర్లను బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో నమోదు చేశారని, ఈ ప్రక్రియ నిత్యం జరిగేదేనని తోటి విద్యార్థులు చెబుతున్నారు. మార్కులు తక్కువ వచ్చినందుకు అంతకు ముందే అక్షిత కన్నీళ్లుపెట్టుకోగా తోటి విద్యార్థులు ఓదార్చినట్లు తెలిపారు. విద్యార్థిని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరి గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## బాలికపై అత్యాచారయత్నం

కోనరావుపేట, జనవరి 29: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డి.ఎస్.పి నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన మానక శంకర్ ఓ బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించగా నిజం అని తేలడంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 107మంది రైతులు 1,035క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 33క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

# కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి29: దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలి విడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రలలో పరీక్షలు కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమేన్స్ డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వివేకనంద డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వాణీనికేతన్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, జేఎన్‌టియుహెచ్ ఇంజనీరింగ్ మంథని పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుండి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,289 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 20మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 1,303 మందికి 1,282మంది విద్యార్థు లు పరీక్షకు హాజరు కాగా 21మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టిపిసీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

## ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి


శిబిరంలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోల్‌సిటీ, జనవరి 29: ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఈపీఎఫ్ఓ రీజినల్ కమిషనర్ తానయ్య సెల్వట్కార్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు సంయుక్తంగా నిధి ఆప్‌కే నికట్ 2.ఓ పేరుతో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈపీఎఫ్ ఖాతాదారులుగా ఉన్న కార్మికులు తమ ఖాతా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు చేసి పరిష్కరించారు. ఈ సందర్భంగా తానయ్య సెల్వట్కార్ మాట్లాడుతూ ఖాతాలో నిధి ఎంత ఎక్కువ ఉంటే ఖాతాదారులకు అంత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్, పదవీవిరమణ, పెన్షన్ అవసరాల నిమిత్తం రుణాలు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఖాతాకు ఆధార్ లింకు చేయడం తప్పనిసరి అని, నామినీ పేరు చేర్చితే ఉద్యోగి మరణాంతరం వారి వారసులకు సొమ్ము సులభంగా బదిలీ అవుతుందన్నారు. ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ కార్మికులకు అందిస్తున్న వైద్య సదుపాయం, బీమా సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేస్తూ నెలవారీగా జాప్యం లేకుండా సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ఖాతాదారులు తమ అవసరాలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు మున్సిపల్ కార్పొరేషన్‌లోనే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయని, కార్మికులకు ఏ సమస్యలు ఉన్నా ఇందులో పరిష్కరించుకోవాలని సూచించారు.

## లింకు కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలి

**● రామగుండం నీటిపారుదల శాఖ ఈఎస్సీ వెంకటేశ్వర్లు**

ధర్మారం, జనవరి 29: మండలంలోని నంది రిజర్వాయర్ నుంచి ధర్మారం డీ83/బి ఎస్సారెస్పీ కాలువ లింకు కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రామగుండం నీటిపారుదల శాఖ ఈఎస్సీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నంది రిజర్వాయర్ నుంచి చేపట్టిన లింకు కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. వానాకాలం సీజన్ వరకు పనులన్నింటినీ పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆయన సూచించారు. రిజర్వాయర్ నుంచి ధర్మారంలోని డి83/బి కాలువ వరకు లింకు కాలువ పనులను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సారెస్పీ సీఈ సతీష్‌రాజుచంద్ర, డీఈ కుమార్, ఏఈలు ఉన్నారు.

## టెండర్ల ద్వారా అంజన్నకు రూ.3.88 కోట్ల ఆదాయం

మల్యాల, జనవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న పలు దుకాణాలకు అధికారులు సోమవారం కరీంనగర్‌లోని దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. వచ్చే ఏప్రిల్ నుంచి మార్చి-2025 వరకు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నిర్వహించిన ఈ టెండర్ల ద్వారా దేవస్థానానికి రూ. 3,88,41,221 ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ. 2,73,70,271 ఆదాయం సమకూరగా ప్రస్తుతం రూ. 1,14,70,950 ఆదాయం అధికంగా సమకూరింది. గతంలో కొండగట్టు దేవస్థానంలోనే టెండర్లు జరుగగా వ్యాపారుల కుమ్మక్కుతో పలుమార్లు వాయిదా పడుతుండడంతో ఈ సారి కరీంనగర్ ఏసీ కార్యాలయంలో నిర్వహించారు. దీంతో అన్నీ ఒకే రోజు ఖరారయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీ స్వామి, ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ అధికారులు ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

## నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభంపై సిఫార్సుల కమిటీ ఏర్పాటు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై సిఫార్సుల కమిటీని నియమించినట్లు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జీవో ఆర్‌టీ నంబర్ 4 ద్వారా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. సభ్యులుగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎ చంద్రశేఖర్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ప్రభుత్వ ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ పరిశ్రమల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, అగ్రికల్చర్, కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, నిజాం షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌లను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో సూచించింది.



# షుగర్ ఫ్యాక్టరీ తెరిచే విధంగా చర్యలు

**● ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 29: ఏడాది లోపే రాష్ట్రంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినా దంతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన కేవలం హామీలకే పరిమితమైందని ఆరోపించారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తెరిపిస్తామని బీఆర్ఎస్ నాయ కులు హామీ ఇచ్చారన్నారు. ఇదే నినాదంతో ఎంపీగా కవిత విజయం సాధించిన 100 రోజుల్లోనే ప్రైవేటు పరంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ వా టా 51 శాతం తేల్చకుండానే ఉన్న ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేశా రన్నారు. తెలంగాణ ప్రజలపై లక్షల కోట్ల అప్పుల భారం మోపి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలకు మాజీ సీఎం కేసీఆర్ పూర్తిగా నైతిక బాధ్యత వహించాలన్నారు. కేసీఆర్ ఆరు నెలల్లో సీఎం అవుతారని అంటున్న కేటీఆర్ వాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఎలా అవుతారో సమాధానం చెప్పాలన్నారు. పదేళ్ల అనుభవంలో కేటీఆర్ నేర్చుకుంది ఇదేనా అన్నారు. ఈ సమావే శంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు జువ్వాడి కృష్ణారావు, గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, దుర్గయ్య ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌కు చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలడని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. ఇందిరా భవన్‌లో ఆయన మాట్లాడారు. నిజామా బాద్ ఎంపీ అభ్యర్థిగా కవిత పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు.


కరీంనగర్‌లో ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు

## ఓవర్‌లోడ్‌పై ఆటోల తనిఖీ

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో ప్రయాణికుల ఆటోలపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం కొరడా ఝులిపించారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలను తనిఖీ చేసి డ్రైవర్ సీటుకు ఇరుపక్కల ఏర్పాటు చేసిన అదనపు సీట్లను, మ్యూజిక్ సిస్టంలు, ఇతర పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదన్నారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ సీఐ పర్స రమేష్, ఎస్ఐ రాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవ చేయడం సంతోషాన్ని కలిగిస్తుంది

**మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు**



చిన్నారులకు స్నాక్స్ అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు

మెట్‌పల్లి, జనవరి, 29 : ప్రజా సేవ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు అన్నారు. సోమవారం మిచ్చమ్మ అనాధాశ్రమంలోని చిన్నారులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్నాక్స్ అందజేసి వారితో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చేందడానికి సంఘం సభ్యుల సూచనలు పాటిస్తూ వారి సహకారంతో కృషి చేస్తానన్నారు. ప్రజా సేవ చేయడానికి ముందుకు వచ్చే వారిని కలుపుకుంటూ మరింత సేవలు చేస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకరం చేసిన మొదటగా అనాదాశ్ర మంలోని చిన్నారులతో గడపడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరు సేవ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దొంతుల లక్ష్మీనారాయణ, చాడ సురేష్, కోట కిరణ్, బండారి గోపి, బండారి సదాశివకుమార్, మంచాల రాజేష్, ఆమెటి సందీప్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలకు అండగా బీజేపీ

**ఎంపీ ధర్మపురి అర్వింద్**



నిజామాబాద్‌లో పార్టీ కార్యకర్తలకు నగదు అందజేస్తున్న ఎంపీ అర్వింద్

మెట్‌పల్లి, జనవరి, 29 : పార్టీ కార్యకర్తలకు బీజేపీ ఎప్పుడు అండగా ఉంటుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం కోరుట్ల నియోజకవర్గంలోని బీజేపీ కార్యకర్త అనారోగ్యం బాధ పడుతుండగా రాచకొండ ఆనంద్‌కు రూ. 20వేలు, బండి గోపాల్ కు రూ. 20వేల నగదును నిజామాబాద్ పార్టీ కార్యాలయంలో ఎంపీ అందజేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు కేంద్రం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది

**బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి**

మెట్‌పల్లి రూరల్, జనవరి 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి చూపుతుందని, దానిలో భాగంగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యల్లో భాగంగా కమిటీ వేసిందని చెరుకు ఉత్పత్తుల సంఘం నాయకుడు, బ్లాక్ కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేంపేట గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో భాగంగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభించేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీల్లో భాగంగా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధానోపాధ్యాయుడిపై ఎంఈవో విచారణ

మెట్‌పల్లి రూరల్, జనవరి, 29: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై ఎంఈవో భీమయ్య సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో విధులు నిర్వహించకుండానే హాజరు వేసుకున్నాడని కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేసిన ఘటనపై డీఈవో ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. 2022-23లో వేసవిలో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల సమయంలో పాఠశాలకు రాకుండానే హాజరు వేసుకొని సర్టిఫికెట్‌ను అధికారులకు సమర్పించి 19 ఈఎల్స్ పొందాడని ఈ నెల 11న కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. డీఈవో ఆదేశాల మేరకు విచారణలో భాగంగా పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్థులు, సర్పంచ్ వివరణను లిఖిత పూర్వకంగా తీసుకున్నట్లు, వాటిని జిల్లా అధికారులను పంపిస్తామని ఎంఈవో తెలిపారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడు యుగందర్ విట్టంపేట పాఠశాలకు బదిలీ అయ్యారని ఆయన తెలిపారు. విచారణలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సర్పంచ్, గ్రామస్థులు, ఉన్నారు.

## కరాటేలో కోరుట్ల విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

కోరుట్ల, జనవరి 29: నేషనల్ ఓపెన్ టూ అల్ స్టైల్ కరాటే చాంపియన్ షిప్‌లో కోరుట్ల ఓకినోవా స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనపరిచి 7 బంగారు, 1 వెండి 3 కాస్యం పతకాలను సాధించినట్లు స్కూల్ కోచ్ అల్లె రమేష్ సోమవారం తెలిపారు. మంచిర్యాల్ పట్టణం లోని పద్మనాయక కల్యాణ భవనంలో నిర్వహించిన ఫస్ట్ ఇంటర్నేషనల్ కరాటే ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఓపెన్ టూ స్టైల్స్ కరాటే చాంపియన్ షిఫ్ 2024 జాతీయ కరాటే పోటీ లలో కోరుట్ల విద్యార్థులు వివిధ విభాగాలలో బంగారు వెండి కాంస్య పతకాలు సాధించారన్నారు. షణ్ముఖ తేజ 2 బంగారు పతకాలు, విఘ్నేష్, శ్రీమహా, హాసినీ, జాహ్నవి, వరుణ్ బంగారు పతకాలు సాధించగా, హాసిని వెండి పతకం, జాహ్నవి, వరుణ్, భానుచందర్ ఒక్కో కాంస్య పతకాలు సాధించినట్లు రమేష్ తెలిపారు. వివిధ విభాగాలలో రాణించిన విద్యార్థులకు టోర్నమెంట్ అర్గనైజర్ ఎం నాగలక్ష్మి పతకాలు, ప్రశంసా పత్రాలను అందించారు. చీఫ్ రమేష్, తెలంగాణ చీఫ్ కే వసంత్ కుమా ర్, ఇప్ప శ్రీనివాస్, మన్నన్ అభినందించారు.

## ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

గొల్లపల్లి, జనవరి 29:మండలంలోని ఐదు ఫర్టిలైజర్ షాపులను ధర్మపురి ఏవో సీహెచ్ రాంచందర్ తనిఖీ చేశారు. నూతనంగా రూపొందించిన ఎఫ్ఐఈవీఎస్ (ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్) యాప్ ద్వారా ఎరువుల నిల్వలు, అమ్మకం తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ యాప్‌లో డీలర్లకు సంబంధించిన సమాచారం వ్యవసాయ శాఖ వద్ద ఉంటుందని, డీలర్లు ఎటువంటి పొరపాటు చేసినా తమకు తెలుస్తుందన్నారు. డీలర్లు పొరపాట్లు చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవో గంగాధర్ నాయక్ ఉన్నారు.

# ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

ధర్మపురి, జనవరి 29: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, బూరుగుపల్లె గ్రామాల్లో రూ 36 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చడం కోసం ముందుకు సాగుతున్నారన్నారు.



ధర్మపురి మండలం బూరుగుపల్లె మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల్లో అర్హులైన ప్రతి పేదవారికి లబ్ధి చేకూరుతుందన్నారు. తన దృష్టికి వచ్చిన ఆరెపల్లి, బూరుగుపల్లె గ్రామాల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్‌కు సర్పంచులు బోర్లకుంట కమల, కంది తిరుపతి, స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, ఎంపీటీసీలు కుంబాల రవిత, కాళ్ల సత్తయ్య, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

● ధర్మపురి మండలంలోని ఆరెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల సంఖ్య, బోధన గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

● ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో గల క్యాంపు కార్యాలయంలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అటవీ శాఖ అధికారులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనాథ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సదాశివుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరేష్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

### అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**గొల్లపల్లి:** రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఇస్రాజ్‌పల్లె మన ఊరు-మన బడి కార్యక్రమాల భాగంగా నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. మండల కేంద్రంలో వారసంత ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. భీంరాజ్‌పల్లి గ్రామంలో వైకుంఠధామాన్ని ప్రారంభించి ఎస్సీ కాలనీలో మురికి కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం దట్నూరు, దమ్మన్నపేట గ్రామాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థపై తీవ్ర నిర్లక్ష్యం వహించిందని, తమ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి వార్షిక బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జలంధర్, ఏఎంసీ చైర్మన్ హన్మండ్లు, సర్పంచులు నిశాంత్‌రెడ్డి, గంగాధర్, సత్యనా రాయణ, పావని నగేష్, అనసూయ చంద్రయ్య, వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ ఆరిఫొద్దీన్, ఎంఈవో జమునా దేవి పాల్గొన్నారు.



భీంరాజ్‌పల్లిలో వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్ కుమార్

# వరద కాలువ మరమ్మతుకు నిధులు మంజూరు చేయిస్తా

**కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు**

మెట్‌పల్లి రూరల్, జనవరి, 29 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామ శివారులోని దెబ్బతిన్న వరుద కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక నాయకులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి దెబ్బతిన్న వరుద కాలువను పరిశీలించారు. వరుద కాలువ దెబ్బతినడంతో పంట పొలాలకు సాగు నీరు అందక ఇబ్బందులకు గురువుతున్నామని తెలిపారు. దీంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వరుద కాలువ మరమ్మతులకు ఎస్టిమేట్ వేసిస్తే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తాన్ననారు. అనంతరం వెల్లుల్ల ఎమ్మెల్యేకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంకు వచ్చిన ఆయనకు గ్రామాభివృద్ధి కమిటీ, ప్రజాప్రతినిధులు శాలువతో సన్మానించారు. గ్రామంలోని దేవాలయంకు సీసీ రోడ్డు నిర్మాణంకు నిధులు మంజూరు చేయించాలని వారు కోరారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు గూడూరు రజిని-తిరుపతి, ఉపసర్పంచు క్యాతం లింగారెడ్డి, తొగిటి అంజయ్య, సురకంటి సంజీవ్, గోపిడి లక్ష్మీనారాయణ, నూతుల రాజారెడ్డి పాల్గొన్నారు.



రామలచ్చక్కపేటలోని దెబ్బతిన్న వరద కాలువను పరిశీలిస్తున్న జువ్వాడి నర్సింగరావు

### కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

మెట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలకు ఆకర్శితులై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోలో చేరుతున్నారని నా యకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ అవినీతి, అక్రమాలపై చైర్మన్ బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లు భూ కబ్జాదారులని, అవినీతి పరులని ఆరోపించడం సబబు కాదన్నారు. నాలుగు సంవత్సరాలు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కానరాని అవినీతి కాంగ్రెస్‌లో చేరగానే భూ కబ్జాలు కనిపిస్తున్నాయా అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రభుత్వ స్థలం కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మాణం ఏలా చేపట్టాడని, పదవిని అడ్డు పెట్టుకొని రోడ్డు విస్తరణ అడుకున్న చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉల్లెందుల రమేష్, సోమిడి శివ, బర్ల వంశీ, కంబ సురేష్, బర్ల రమేష్, పొన్నాల ఎల్లేష్ పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



క్రికెట్ కిట్ అందిస్తున్న ఎస్సై

మల్యాల, జనవరి 29: క్రీడలు స్నేహభావాన్ని పెంపొదిస్తాయని ఎస్సై టీ.అశోక్ పేర్కొన్నారు. కొండగట్టు సమీపంలో నిర్వహిస్తున్న వన్ క్రికెట్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేసి బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. వైద్యుడు మహేష్‌రెడ్డి నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఆగంతపు వంశీ, ప్రభాకర్‌రెడ్డి, రవితేజ, సంతోష్, గంగాధర్ పాల్గొన్నారు. లీగ్ ముగింపు కార్యక్రమానికి టీం ఇండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ హాజరవు తారని నిర్వాహకులు తెలిపారు.

### సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని వినతి

రాయికల్, జనవరి 29: రాయికల్ పట్టణంలోని 9వ వార్డులో కొత్తగా సెల్ టవర్ నిర్మాణం చొప్పరి భూమయ్య ఇంటి వద్ద నిర్మిస్తున్నారని, టవర్ నిర్మాణ పనులను ఆపివేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్‌కు సోమవారం కాలనీ వాసులు వినతి పత్రం సమర్పించారు. సెల్‌టవర్ వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని, రేడియేషన్‌తో అనేక రోగాలు వస్తాయని పేర్కొన్నారు. కావున సెల్‌టవర్ నిర్మాణ పనులు ఆపివేయాలని కోరారు. 11వ వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

### మరమ్మతులు చేయించాలని..

జగిత్యాలరూరల్, జనవరి : మండలంలోని తిమ్మాపూర్- రఘురాముల కోట రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొడిపెల్లి రాజు, కొడిపెల్లి అరవింద్ అనే యువకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తిమ్మాపూర్-ర ఘురాములకోటకు వెళ్లే రహదారి పూర్తిగా గుంత లమయమైందని రాకపోకలకు ఇబ్బందవుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తాం

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

మేడిపల్లి, జనవరి 19: ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన హమీలన్నిటినీ తప్పకుండా నెరవేరుస్తామని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మేడిపల్లి మండలంలోని వియతాబాద్ గ్రామంలో గ్రామ పంచాయితీ నేతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తన గెలుపు కృషి చేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని అన్నారు. విలాయతాబాద్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిచరణ్‌రావు, సర్పంచ్, ఎంపీటీసీ రాజు, కాంగ్రెస్ నేతలు నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేంధర్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, ముస్కెం జలందర్‌గౌడ్, లచ్చానాయక్, దామెదర్, దశరథరెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

## కాంగ్రెస్ పార్టీలో చేరిన యామాపూర్ సర్పంచ్

ఇబ్రహీంపట్నం, జనవరి 29: మండలంలోని యామాపూర్ గ్రామ సర్పంచ్ తలారి మనీష-ఆనంద్, అమ్మక్కపేట ఎంపీటీసీ సరోజన భర్త సుదర్శన్‌లు సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బొరిగం రాజు, ఎంపీటీసీలు పోనకంటి చిన్న వెంకట్, జలేష్, తిమ్మాని రాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక నిలువలు స్వాధీనం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 29 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలోని వరుద కాలువ వద్ద ఉన్న ఇసుక నిలువలను సోమవారం రెవెన్యూ, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలోని వరుద కాలువలోని రైతుల మోటర్లు ఇసుకలో కూరకుపోవడంతో సాగు చేస్తున్న పంటలకు నీరు అందక ఎండిపో తాయని గతంలో ఇరిగేషన్ అధికారులకు సమస్యలను వివరించారు. దీంతో కూరుకుపోయిన ఇసుకను తీసి ఒడ్డుకు పోసి మోటర్లు తీసుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. రైతులు స్వంత డబ్బులతో కాలువలోని ఇసుకను తీసి ఒడ్డుకుపోశారు. పోసిన ఇసుక నిల్వలను రెవెన్యూ, పోలీసులు స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వారిలో ఇరిగేషన్ డీఈ అరుణ్, ఎస్సై చిరంజీవి, నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహమ్మద్, సిబ్బంది ఉన్నారు.



ఇసుక నిల్వలను స్వాధీనం చేసున్న అధికారులు

# నేటి బాలురే రేపటి పౌరులు

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

ధర్మపురి, జనవరి 29: నేటి బాలురే రేపటి పౌరులని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఓల్డ్ టీటీడీ ధర్మశాల ఆవరణలో ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్ క్రీడా, సాంస్కృతిక దినోత్సవ వేడుకలను సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ విద్య ద్వారానే అన్ని సాధ్యమన్నారు. విద్యార్థులు కష్టించి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలను తిలకించి ప్రశంసించారు. అంతకు ముందు స్కూల్ పక్షాన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్, కౌన్సిలర్ సంగనభట్ల సంతోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ అందజేసిన విప్

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన సురేందర్ రెడ్డికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీని సోమవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, సర్పంచ్, మాజీ సర్పంచులు సంతోష్, రాజేశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు మహేష్, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, విజయ్, శ్రీనివాస్, దిలీప్, శ్రీనివాస్ రెడ్డి, స్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వివిధ వేషధారణలతో విద్యార్థులు

## సంక్షిప్త సమాచారం

**కథలాపూర్ :** మండలంలోని సిరికొండ సింగిల్ విండో చైర్మన్ చుక్క దేవరాజంపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టిన నేపథ్యంలో డైరెక్టర్లు సోమవారం క్యాంపునకు తరలివెళ్లినట్లు తెలిసింది. 9 మంది సభ్యులు తమ సంతకాలతో అవిశ్వాసం ప్రవేశపెడుతూ జిల్లా సహకార అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5న బల నిరూపణకు అధికారులు నిర్ణయించి ఈ మేరకు డైరెక్టర్లు, చైర్మన్‌కు నోటీసులు పంపించారు. ఈ క్రమంలో 9 డైరెక్టర్లు తిరుపతికి క్యాంపునకు తరలి వెళ్లారని సమాచారం. ఇటీవల విదేశాల నుంచి వచ్చిన డైరెక్టర్ చైర్మన్ పదవి ఆశిస్తున్నారని తెలుస్తోంది.

**రాయికల్:** అంబేద్కర్ సంఘం సీనియర్ నాయ కుడు, మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాయికల్ మండలం కిష్టంపేటకు చెందిన జాన గోపి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక య్యాడు. ఫిబ్రవరి 11న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందజేయనున్నట్లు అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధకృష్ణ పేర్కొన్నారు.

**రాయికల్:** రాయికల్ పట్టణానికి చెందిన యువ న్యాయవాదులు అల్లె పురుషోత్తం-వనితల కుమారుడు విశ్వకౌసేన్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మండలంలోని ఒడ్డెలింగాపూర్ (లోక్యానాయక్ తండా) గ్రామంలో నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. జిల్లా దిశ కమిటీ సభ్యుడు భూక్య గంగాధర్ నాయక్, నాయకులు సాయికుమార్ పాల్గొన్నారు.

**మల్లాపూర్:** యాసంగిలో సాగు చేస్తున్న వరి పంటలకు నారు దశ నుండా కాండం తోలుచు పురుగు ఆశిస్తున్న నేపథ్యంలో కార్బొఫ్యూరాన్ గుళికలను చల్లి రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి లావణ్య సూచించారు. సోమవారం మండలంలోని మల్లాపూర్, దాంరాజ్‌పల్లి, వాల్గొండ గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. మొగి పురుగు సోగి పంటలను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు పలు సూచనలు చేశారు.

**కొడిమ్యాల:** మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పట్టెనామాలు, కోరమీసాలు అమ్ముకొను హక్కు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు హక్కు పొందుటకు ఈ నెల 31న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు, ఈవో మారుతి తెలిపారు.

**రాయికల్:** క్రీడాకారులు మానసిక ధృడత్వాన్ని కలిగి ఉండాలని రాయికల్ పట్టణ ఎస్సై అజయ్ పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలో 1వ కుంగ్‌ఫూ ఓపెన్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో రాయికల్ పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాయికల్ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ కనుక ప్రభాకర్, ప్రవీణ్‌ల వద్ద శిక్షణ తీసుకున్న కండ్లపెల్లి శశాంక్, గంగాధరి హన్సిత్, ఇంద్రాల చైత్రిక, వేల్పుల ప్రహర్షిత, యశోద సాహిత్యలు బంగారు పతకాలు సాధించారు అలాగే వేల్పుల సాత్విక్, దేవ లాస్యప్రియలు కాంస్య పతకాలు సాధించారు. వారిని ఎస్సై అజయ్ అభినందించి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

**మల్యాల:** మండలంలోని రామన్నపేటలో సోమవారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మేలు చేస్తాయని పలువురు పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల సతీష్‌రెడ్డి, వైద్యురాలు శిరీష, గడ్డం మల్లారెడ్డి, కారోబర్ ఆనంద్, వినయ్ పాల్గొన్నారు.

**కోరుట్ల రూరల్ :** పట్టణంలోని పశువైద్య కళాశాలలో పలు పశువు ల విక్రయాలకు వేలం వేస్తునట్లు కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, పశుగణ క్షేత్ర సముదాయ విభాగం వారు సోమవారం తెలిపారు. ఈ నెల 30 తేదీన ఉదయం 10 గంటలకు వెలం వెయనున్నట్లు వారు తెలిపారు. ఒంగోలు జాతి మగ దూడ, రెండు మహబూబ్ నగర్ మేక పోతులు, నాలుగు లార్జ్‌వైట్ యార్క్‌షైర్ మంగ పందులు (పోతులు)లను వేలం ద్వార విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. ఆశక్తి గల వారు వెలం పాటలో పాల్గొవాలని వారు కోరారు.

**కథలాపూర్:** మండలంలోని భూషణరావుపేటకు చెందిన అంబేద్కర్ మాల సంఘం సభ్యులు నూతన భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు.

నిధుల మంజూరు పట్ల ఎమ్మెల్యే సా నుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు. సంఘ పెద్దలు, సభ్యులు, మాజీ సర్పంచ్ స్వామిరెడ్డి ఉన్నారు.

●మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంఈవో ఆనందరావు బహుమతులు పంపిణీ చేశారు. స్పెల్ విజార్డ్‌లో కస్తూర్బాగాంధీ విద్యాలయానికి చెందిన మధు హాసిని, పోతారం పాఠశాలకు చెందిన శైలజ, డ్రామా పోటీల్లో అంబారిపేట, మోడల్‌స్కూల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నల్ల సంజీవ్‌రెడ్డి, వెంకటేశం, దరందీప్, హరిదాస్, శివరంజని, సుమలత, అలేఖ్య ఉన్నారు.

**రాయికల్:** రాయికల్ మండలంలోని రాజనగర్ గ్రామంలో సోమవారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో భరతమాత పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ జాగరణ సమితి సభ్యులు తిరుకోవెల సురేందర్, నాగావత్ శ్రీనివాస్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.